27122024-MAI-04_Layout 1 12/27/2024 2:14 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

చెప్పేదొకటి.. చేసేదొకటి

మనసా వాచా కర్మణా అని త్రికరణ శుద్ధి గురించి చెప్పారు పెద్దలు. మనసులో ఉండేదే బయటకు చెప్పాలి.. బయటకు చెప్పేదే చేయాలి అని దీనర్థం. ఇక చిత్తశుద్ధి అనేది లేనివారు చెప్పేదొకటి, చేసేదొకటి. ఇందుకు మన రేవంత్ సర్కారును మించిన ఉదాహరణ దొరకదు. మూసీ నది విషయంలో వేస్తున్న కుప్పిగంతులు అందుకు సరిగ్గా సరి పోతాయి. ముందుగా మూసీ సుందరీకరణ అని అన్నారు. ఆ సుందరీ కరణలో ఏముంటుందో తెలియదు. దాని గురించి ఆలోచిస్తుండగానే మాటుమార్చి కాదు కాదు పునరుజ్జీవమని అన్నారు. ఇప్పుడు అదీ కాదని తేలిపోయింది. కర్కశంగా హైడ్రా డైనోసార్లను తోలి ఇండ్లను కూలుస్తు న్నప్పుడు కొందరు ఇది వందరోజుల హామీల వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకేనని అంచనా వేసుకున్నారు. కానీ, పేదల ఇండ్లను కూల్చడం వెనుక పెద్దలకు రియల్ ఎస్టేట్ అప్పనంగా కట్టబెట్టే కుట్ర ఉందని తాజాగా తేటతెల్లమైంది. ప్రపంచ బ్యాంకుకు సమర్పించిన ప్రాథమిక ప్రాజెక్టు రిపోర్టులో మాయల పకీరు ప్రాణం దాగున్నట్టు బహి ర్గతమైంది. ఇదంతా కార్పొరేట్ సుందరీకరణ, లాభార్జన పునరుద్ధరణ తప్ప మరొకటి కాదని తెలిసిపోతున్నది. మనసులో ఉన్నది లబ్ది, చెప్పింది పునరుద్ధరణ, చేసింది కూల్చివేతలు. మూసీనది మురికిని కడి గితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఆ మురికిలో కాసులవేటకు వెంపర్లాడటం విడ్డూరం. పుల్లాపుడకా చేర్చి నది ఒడ్డున గూడు కట్టు కున్న పేదలను దిక్కులేని పక్షులను చేయడం అంతకంటే ఘోరం.

కాంగ్రెస్ అసలు చెప్పింది ఏనాడు చేసిందని? అరచేతిలో స్వర్గం చూపింది. అందరికీ అన్నీ అని ఊరించింది. ఇదివరకటి సర్కారు సంక్షేమం కోసం కల్పిస్తున్న సాయాలను పెంచుతామని అడ్డగోలుగా హామీలిచ్చింది. మొండిచెయ్యి చూపడం కాంగ్రెస్‌కు మొదటి నుంచీ అల వాటే. అందుకే తనను నమ్మరేమోనని 'గ్యారెంటీ' అనే తోకను తగిలిం చింది. అదీ నమ్మరేమోనని దేవుళ్ల మీద ఒట్టుదాకా పోయింది. అధికార దాహం వేయించిన వింతవేషాలు ఫలించాయి. మోసపోయి గోస పడు తున్న జనం ఏమైపోతేనేం. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అనే నీతి వంటబట్టించుకున్న కాంగ్రెస్ ఒట్టు తీసి గట్టున పెట్టి మూసీలో మునకేసి కాసుల వేటకు పాల్పడుతున్నది.

తెలంగాణ సాధకుడు కేసీఆర్ ఏనాడూ కేవలం తాయిలాల హామీల మీద గెలవలేదు. మనసా వాచా కర్మణా తెలంగాణ విజయాన్ని కాంక్షించి నిలిచి గెలిచారు. రాజకీయ చతురత చూపి ఓట్ల యుద్ధంలో ఎత్తుకు పైఎత్తు వేసి విపక్షాలను చిత్తు చేశారు. ఆ మాటకు వస్తే హామీలు ఇవ్వలేదని కాదు. ఇచ్చినవీ నెరవేర్చారు. ఇవ్వనివీ చేసి చూపారు. అంతే తప్ప కాంగ్రెస్ తరహాలో కల్లబొల్లి కబుర్లు చెప్పి కన్నుగప్పి ఓటు కాజే యలేదు. రెండు ద్వితీయ విజయాలే అందుకు నిదర్శనం. మూడో విజయం ఎందుకు చేజారిందో ఇప్పుడు ప్రజలకు బాగా ఎరుకైంది. ఊరూరా బద్దలవుతున్న తిరుగుబాట్లే ఇందుకు సాక్ష్యం. ఇచ్చిన హామీలు తూచ్ అనడమే కాకుండా ధనదాహంతో మూసీని కార్పొరేట్లకు కాను కగా సమర్పించుకుంటున్న కబంధహస్తాన్ని ప్రజలు గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు ఓటుపోటుతో బుద్ధి చెప్పడం ఖాయం.

సిలబస్ మారొచ్చు.. కానీ చరిత్ర మారదు!

తెలుగు సమాజానికి ఉజ్వలమైన చరిత్ర ఉన్నది. దేశవిముక్తి ఉద్యమాలు.. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాలు తెలంగాణ నేల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అయితే, రాజుల కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య కాలం వరకు తిరుగుబా ట్లపై అణచివేత మాత్రం అలాగే కొనసాగుతోంది. ప్రతి తిరుగుబాటుపైన కాలాన్ని బట్టి, అక్కడున్న వ్యవస్థలను బట్టి రూపం మార్చు కుంటూ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రాజ్యాధికారాన్ని ధిక్కరించి మాట్లాడినవాళ్లంతా ఏదో ఒక రూపంలో దాడులకు గుర య్యారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. అసువులుబాసారు. వీరతెలంగాణ సాయుధ పోరాటంలో 4 వేల మంది నేలకొరిగారు.

జూలూరు గౌరీశంకర్

స్వాతంత్ర్యానంతరం రాజ్యానికి, నక్సలైట్లకు మధ్య జరిగిన పోరాటంలో వేలమంది పోలీసులు, నక్సలైట్లు చనిపోయారు. ఈ ఉద్యమ ప్రవాహంలో సాహిత్య, సాంస్కృతిక సంస్థలు వెలువరించిన కావ్యాలపై, కవితలపై, పాటలపై, మాటలపై, అడుగులపై, నడకలపై, నడ తలపై, కాలిగజ్జెలపై, గొంగళ్లపై, ప్రజాకంఠాలపైన నిషేధాలు విధించారు. నిషేధ సాహిత్యంపై విశ్వ విద్యాలయాలే పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా లిచ్చాయి. అది శ్రీకాకుళం గిరిజన రైతాంత పోరా టమైనా, నక్సల్‌బరీ వసంత మేఘ గర్జనతో ఉత్తర తెలంగాణ ఎరుపెక్కినా ఆయా కాలాల్లో వచ్చిన సాహిత్యంపై నిషేధాలు విధించారు. ఇది రాజ్యస్వ భావం. దీనికి ఆశ్చర్యపోనక్కర్లేదు.

నిషేధాలు ఎక్కువగా చేసే ప్రభుత్వాలు నిరం కుశ సర్కార్లుగా చరిత్రలో నిలిచిపోతాయి. అవి ఎమర్జెన్సీ చీకటి రోజులు కావచ్చు.. 1970-1975 వరకు తెలంగాణ జిల్లాల్లో కొనసాగిన అప్ర కటిత చీకటి రోజులు కావచ్చు. రాజ్యానికి కోపం వస్తే ఎన్‌కౌంటర్లతోనే పరిమితమైపోదు. అది సాహిత్యాన్ని కూడా నిషేధిస్తుంది. ఆట, పాట, మాటను కూడా నిషేధిస్తుంది. రాజ్యం కన్నెర్రజేస్తే వీరుల స్తూపాలను కూడా నేలరాలుస్తుంది. రాజ్యానికి అవసరం వస్తే అమరుల స్తూపాలకు మొక్కుతుంది. అందుకు పార్టీల పేరును ఉటంకిం చాల్సిన అవసరం లేదు. అందరికీ తెలిసినవే. 'ఇం దిరమ్మ సోషలిజం ఎందాకొచ్చిందిరో, అది ఇంద్ర వెల్లిలోన వంద మందిని మింగిందిరో', 'ఇంద్ర వెల్లి కదిలింది పోరుబాట సాగింది.. పోరాటం ఆపకుండా మున్ముందుకు సాగింది' అన్న పాటలు తెలంగాణ నేలకు సుపరిచితాలే. ఎవరి పాలనలో, ఏ రాజ్యం ఏలుబడిలో వీరుల నెత్తురు నేలచింది ఇంద్రవెల్లి స్తూపం అయ్యిందో.. అదే రాజ్యం కొన్ని దశాబ్దాల తర్వాత అదే స్తూపానికి మొక్కి ఆ అమరుల వీరత్వాన్ని చాటి చెప్పడం కూడా తెలం గాణ నేల చూసింది.

విప్లవ రచనలపై నిషేధం వాయిదాల పద్ధతిలో నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అది ఆగేది కాదు. ప్రతిఘటన పోరాటాలపై, ఉద్యమాలపై ప్రభుత్వ దాడులు, ఘర్షణలు సహజం. అది వర్గాల మధ్య వర్గపోరాటంగా కొనసాగుతూ ఉంటుంది. అధికార రాజముద్రల మధ్య కూడా పోరాటం అదే రీతిలో కొనసాగుతూ ఉంటుంది. అది ఒక ప్రభుత్వంపై మరో ప్రభుత్వం దశల్ని బట్టి స్థాయిల్ని బట్టి ఉంటుంది. అది విమర్శల పర్వం కావచ్చు, దాడుల పర్వం కావచ్చు, ఒకరిపై ఒకరు ఆ ఘర్షణల పరంపరను వర్తమాన సంఘ ర్షణగానూ మార్చవచ్చు.

> **గత ప్రభుత్వం చేసిన పనుల కంటే తాము గడ్డెనెక్కినాక చేసే పనులు మరింత గొప్పగా ఉండాలని ప్రభుత్వాలు పాలనలో పోటీ పడటం సహజం. అది ఆరోగ్యకరమైన స్థితికి చిహ్నమే. కానీ, ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్నదేమి టంటే అనారోగ్య రాజకీయ వాతావరణం. అది రాష్ట్రమంతటా భారీ వ్యాధిగా మారిపోయింది.**

అది ముదిరి ఎక్కడిదాకా వచ్చిందంటే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలం గాణ తల్లి విగ్రహం మార్పు దాకా. ఇప్పుడు తెలం గాణలో విగ్రహాల యుద్ధం నడుస్తోంది. మలిదశ తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఈ విగ్రహ తల్లుల చర్చ లెగిసింది. అప్పుడు తెలుగు తల్లి, తెలంగాణ తల్లి విగ్రహాల మధ్య భారీగా చర్చ జరి గింది. ఆ మలిదశ తెలంగాణ ఉద్యమం తనకు తానుగా సృష్టించుకున్న తెలంగాణ తల్లి విగ్రహం



అది. కవులు, కళాకారులు, శిల్పులతో లోతుగా చర్చించి ఉద్యమ బిడ్డలు తమ ఉద్యమతల్లి రూపాన్ని ప్రతిష్ఠించుకున్నారు. బతుకమ్మలు, బోనాలు, వంటావార్పులు, జేఏసీలు, ధూంధాం లలో ఆ ఉద్యమతల్లి రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని అనేక ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు ముందుకుసాగాయి. రాజకీయ ప్రక్రియతో ఉద్య మించిన ఉద్యమపార్టీ టీఆర్ఎస్ ఆ తెలంగాణ తల్లి విగ్రహాలను వందల, వేల గ్రామాల్లో ఉద్య మకాలంలోనే ప్రతిష్ఠించింది. నాటి వలసాధిపత్య ప్రభుత్వం కూడా ఉద్యమ తల్లి విగ్రహంపై ఆంక్షలు విధించలేకపోయింది. మలిదశ ఉద్యమ గెలుపుతో స్వరాష్ట్రం అవతరించాక అమరుల స్వర్గ ధామాన్ని తెలంగాణ సచివాలయం ఎదుటే నిర్మిం చుకున్నాం. ఆ అమరజ్యోతిలో తెలంగాణ తల్లి రూపాన్ని కూడా ప్రతిష్ఠించుకున్నాం.

కానీ, 2023 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తెలంగాణ తల్లి విగ్రహం రూపుమార్చి కొత్త విగ్రహాన్ని సచివాల యంలో ప్రతిష్ఠించింది. తాము రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహమే అధికారిక తెలంగాణ తల్లి అని జీవో కూడా విడుదల చేసింది. ఇప్పటి దాకా పుస్తకాలపై నిషేధాన్నే చూసిన తెలుగు సమాజం ఇక విగ్రహాలపై కూడా నిషేధాన్ని చూస్తోంది. తమ గుర్తులు శాశ్వతంగా నిలిచిపోవా లని కొత్త ప్రభుత్వాలు పనిచేస్తాయి. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కొనసా గిస్తాయి. అది ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కావచ్చు, ఇంకేమైనా ఉండవచ్చు. కానీ, కాంగ్రెస్ సర్కార్ అలా కాదు. గత ప్రభుత్వ గుర్తులను చెరి పేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నది. గత ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల్లో తొలి ముఖ్య మంత్రి ముఖచిత్రాలను కూడా చించివేయిం చడం ఏ సంస్కృతికి చిహ్నమో అర్థం కావడం లేదు. సాహిత్య అకాడమీ, తెలంగాణ సాంస్కృ తిక శాఖ తదితర సంస్థలు పాఠ్యపుస్తకాల్లో నాటి ముఖ్యమంత్రి ఫోటోలు లేదా వారి సందేశాలు ఉండటం సహజం. కానీ, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం తొలి తెలంగాణ ముఖ్య మంత్రి ముద్రించిన పుస్తకాల్లోని కేసీఆర్ ముద్రల్ని తొలగించే కార్యాన్ని చేపట్టింది. ఇప్పటికే పాఠ్యపు స్తకాలను వెనక్కు తెప్పించి కేసీఆర్ ముఖచిత్రం లేకుండా తీసివేశారు. ఇప్పుడు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ముద్రించిన గత ముఖ్యమంత్రి సందేశాలు ఉన్న పేజీలను చింపేశారు. ఈ పనిని బహిరంగంగానే ప్రకటించి మరీ చేస్తున్నారు. కేసీ ఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం.

42 రోజుల పాటు జరిగిన సకలజనుల సమ్మె చరిత్రను ఎవరూ చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమ ఘట్టాలను చెరిపేయలేరు. ఎవరికనుకూ లంగా వారు చరిత్రను సొంత గళంతో రాసు కుంటే రాసుకోవచ్చు. కానీ, అసలైన చరిత్రపై హస్తాలు వేస్తామంటే చరిత్ర ఒప్పుకోదు, చరిత్ర కారులు ఒప్పుకోరు. పొరుగు రాష్ట్రం తమిళనాడు సీఎం స్టాలిన్ అంతకుముందు ముఖ్యమంత్రి జయలలిత ముఖచిత్రంతో ఉన్న పిల్లల పుస్తకాల సంచుల్ని చింపివేయలేదు. పుస్తకాల్లో ఉన్న జయ లలిత సందేశాలను తొలగించలేదు. అమ్మ క్యాంటీన్ల పేరు మార్చలేదు. రాజులు పోవచ్చు, రాజ్యాలు పోవచ్చు. పాలకులు మారొచ్చు, ప్రభు త్వాలు పోవచ్చు. చరిత్ర మాత్రం మారదు. తల్లులు మారరు. అలాగే సిలబస్‌లు మారొచ్చు.. కానీ, చరిత్ర మారదు.

> **కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చూస్తాం, చేస్తాం అని ఒక పక్క ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలోచనల మేరకు ప్రభుత్వ శాఖలు పనిచేయాలి. దాన్నెవ్వరు కాదనరు. కానీ, గత ప్రభుత్వంలో వేసిన చరిత్ర పుస్తకాల నుంచి వెదికి మరీ నాటి ముఖ్యమంత్రి ఆనవాళ్లను చెరిపేయడానికి ప్రభుత్వ శాఖలే పూనుకొనడం విచారకరం.**

జీఎస్టీ ప్రస్థానం

కుక్కపిల్ల,
అగ్గిపుల్ల,
సబ్బు బిళ్ల...
హీనంగా చూడకుదేన్ని
జీఎస్టీ మయమేనోయ్ అన్ని

రొట్టెముక్క,
అరటితొక్క,
బల్లచెక్క...
ఆయన వైపే చూస్తూ ఉంటాయ్
తమలో జీఎస్టీ కనుక్కోమంటాయ్

తలుపు గొళ్లెం
హారతి పళ్లెం
గుర్రపు కళ్లెం...
కాదేది జీఎస్టీ కనర్హం
ఔనౌను శిల్ప మనర్హం

ఉండాలోయ్
టాక్సావేశం
ఉంది కదా కౌన్సిల్ నిర్దేశం

దొరకదటోయ్ కారణలేశం
కళ్లంటూ ఉంటే చూసెయ్,
వాటంగా పన్నులు వేసెయ్
ప్రపంచ మొక పద్మవ్యూహం
జీఎస్టీ ఒక తీరని దాహం...



పెండ్యాల మంగళాదేవి

సర్కారు సాలెగూడులో చిక్కుకున్న ఎర్ర జెండాలు!

తెలంగాణలో పుష్ప వైల్డ్ ఫైర్ హైడ్రామాకు తెరపడింది. రాష్ట్రంలో ఆ సినిమా ఏ స్థాయిలో ఆడిందో తెలియదు కానీ, మూడు వారాల పాటు రాజకీయ రచ్చ మాత్రం కావాల్సినంత జరిగింది. పుష్ప ఫైర్‌లో రాష్ట్రంలోని అన్ని సమస్యలు కాలిబూడిదైపోయాయి. చివరికి అసెంబ్లీ సమావేశాల్లో సైతం ప్రజా సమస్యలపై చర్చ జరగలేదు. ప్రభుత్వం, సినీ పరిశ్రమకు మధ్య జరిగిన తాజా భేటీతో 22 రోజుల సినిమాకు ఎండ్ కార్డ్ పడినట్టయింది.

తోటకూర రమేష్

కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, మాటలు అన్నీ తానై సీఎం రేవంత్ నడిపించిన పొలిటి కల్ హైడ్రామాలో చివరికి విలన్‌గా మారింది మాత్రం కమ్యూనిస్టు పార్టీ. ప్రభుత్వం, ఎంఐఎం ట్రాప్‌లో ఎర్ర జెండా పార్టీ పడిపో యింది. ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఫార్ము లా-ఈ రేస్‌పై సభలో చర్చకు బీఆర్ఎస్ పట్టు బడితే అది ఒక కుటుంబ వ్యవహారమని చెప్పిన కమ్యూనిస్టు నేతకు సంధ్య థియేటర్ అంశంలో ఎలాంటి ప్రజా సమస్య కనిపించిందో మరి? కుటుంబ వ్యవహారం కోసం సభ సమయం వృథా చేయాలా? అని ప్రశ్నించిన లెఫ్ట్ పార్టీకి ఒక వ్యక్తి గురించి గంటల కొద్దీ ప్రసంగిస్తుంటే విలువైన సమయం వృథా అవుతున్నట్టు కనిపిం చకపోవడం విడ్డూరం. ఫార్ములా-ఈ రేస్ ప్రభుత్వ ఈవెంట్. ఆ ఈవెంట్‌లో ప్రజల డబ్బు ఉంది. అందులో అవినీతి జరిగిందని ప్రభుత్వం ఆరోపణలు చేస్తుంటే అది వ్యక్తిగతం ఎట్లా అవుతుందో వారి విజ్ఞతకే వదిలేద్దాం.

రాష్ట్రంలో గురుకులాల్లో విద్యార్థులు విషా హారం తిని మృతిచెందుతున్నారు. రైతులు, ఆటోకార్మికులు బలవన్మరణాలకు పాల్పడుతు న్నారు. మూసీ, హైడ్రా బాధితులు రోడ్డునప డ్డారు. క్రైమ్ రేట్ దాదాపు 41 శాతం పెరిగిం దని పోలీసుల నివేదికలే చెబుతున్నాయి. ఇంకా రాష్ట్రంలో అనేకానేక సమస్యలున్నాయి. వీటిపై ఎప్పుడైనా ఇంత అత్యవసరంగా ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారా? మంత్రులతో కూర్చొని మాట్లాడిన ఉదంతాలు ఉన్నాయా? వీటంన్నిటినీ పక్కనపెట్టి మరీ సినీ పెద్దలతో అత్యవసరంగా ఎందుకు భేటీ అవుతున్నారని కమ్యూనిస్టులకు సీఎంను అడిగే దమ్ముందా?

నిజానికి తెలంగాణలో ఇప్పటికిప్పుడు సినిమా పరిశ్రమకు వచ్చిన కష్టం ఏమీ లేదు. సీఎం రేవంత్ చెప్పినట్లు వారు రాష్ట్రం కోసం, దేశం కోసం సరిహద్దుల్లో యుద్ధం ఏమైనా చేశారా? వాళ్లు వ్యాపారులు. పెట్టుబడి పెట్టి లాభాలు గడిస్తారు. మరి అలాంటివారి కోసం రాష్ట్రంలోని అన్ని సమస్యలను పక్కనపెట్టి మరీ ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించే ధైర్యం ఎర్రజెండా నేతలకు ఉందా? ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించే చరిత్ర కమ్యూనిస్టు పార్టీలది. ఇదంతా గతం. ఇప్పుడు ఎర్ర జెండా పార్టీలు ప్రభుత్వం పక్షాన నిలబడు తున్నాయి. అందుకే ప్రజలే వారిని నిలదీసే పరిస్థితి వచ్చింది.

ఒకవైపు దేశంలో ప్రజలు ఏం తినాలి? ఏం మాట్లాడాలి? ఏం రాయాలి? ఎలాంటి సిని మాలు తీయాలి? ఎలాంటి బట్టలు వేసుకో వాలి? అని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలపై ఒత్తిడి తీసుకువస్తున్నదని చెప్పే కమ్యూనిస్ట్ పార్టీలకు కాంగ్రెస్ పార్టీ నేడు పుష్ప సినిమాపై చేస్తున్న రాద్ధాంతం కనిపించడం లేదా? ఇది వారి రెండు నాల్కల ధోరణికి నిద ర్శనం కాదా? దేశంలోని కాంగ్రెస్, బీజేపీ, చివ రికి కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఒకే తాను ముక్కలే అన్నది దీన్నిబట్టి స్పష్టమవుతున్నది. కాంగ్రెస్‌తో అంటకాగుతూ సినిమాను సిని మాలా చూడని భావదారిద్ర్యానికి కమ్యూని స్టులు దిగజారిపోయారు.

సినిమాను సినిమాలాగే చూడాలని అనేక వేదికపై ఉపన్యాసాలు దంచే వీరే ఇప్పుడు పుష్ప దగ్గరకు వచ్చేసరికి అందులో ఏదో ఉందని ఈకలు పీకుతున్నారు. కమ్యూనిస్టులు చెప్పు న్నట్టు పుష్ప సినిమా చూసి యువత దొంగత నాలు చేస్తే.. మరి అనేక సినిమాల్లో హీరోలు అన్నలుగా నటించారు. నక్సల్స్ ఉద్యమాలే కథాంశంగా అనేక సినిమాలు వచ్చాయి. మరి యువత ఎందుకు ఆ ఉద్యమాల వైపు ఆకర్షి తులు కాలేదు. అంతేకాదు, చాలా సినిమాల్లో ఎన్‌కౌంటర్ల సీన్లు ఉన్నాయి. మరి వాటి గురించి మాట్లాడకుండా కేవలం పుష్పలో ఇట్లా ఉంది, అట్లా ఉంది అంటూ మాట్లాడటం వాళ్ల మూల సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారని చెప్పేం దుకు నిదర్శనం కాదా? మరోవైపు సినిమా ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య దూరం పెరిగిం దని అందుకే సంధ్య థియేటర్ ఇష్యూ ముదిరిం దని కొందరు చెప్తున్నారు. అసలు ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య దూరం పెరగలేదు.

> **సీఎం రేవంత్ మాటల్లో చెప్పాలంటే కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల కోసం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం అత్యవసరంగా భేటీ కావా ల్సిన అవసరం లేదు. వాస్తవానికి, ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వానికి, ప్రజ లకు మధ్య భారీ గ్యాప్ వచ్చింది. అయినా ఈ గ్యాప్‌ను పూడ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌కు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు సమయం ఉండటం లేదు.**

మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడిన చద రంగంలో అటు పోలీసు వ్యవస్థ, ఇటు కమ్యూ నిస్ట్ పార్టీలు ప్రజల దృష్టిలో విలన్లుగా మారా యి. నిజానికి కమ్యూనిస్ట్ పార్టీలు ప్రజల పక్షం. ప్రజా ఉద్యమాలతో జనాల్లో చైతన్యం తీసుకు వచ్చిన పేరు వాటికి ఉన్నది. అయితే, కాంగ్రెస్ ట్రాప్‌లో పడి ఆ పేరును కోల్పోతున్నాయి. అటు దేశంలోనే స్మార్ట్ పోలీసింగ్‌గా గుర్తింపు పొందిన తెలంగాణ పోలీస్ వ్యవస్థ కూడా పేరుప్రతిష్టలను పోగొట్టుకున్నది. ప్రభుత్వ ఒత్తి డితో అల్లు అర్జున్ ఇష్యూలో అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు తమపై మచ్చపడేలా చేసుకున్నారని తెలంగాణ సమా జం చర్చించుకుంటున్నది. ఈ నేపథ్యంలో పోలీసు వ్యవస్థ తీరు ఆందోళనకరం.



'బ్యాలెట్' ఎన్నికతో మీకేం ఇబ్బంది?

ఈవీఎంల ద్వారా నాలుగుసార్లు ప్రజాప్రతినిధిగా గెలిచిన నేను ఆ యంత్రాల వల్ల అవకతవకలు జరుగుతున్నాయని ఎలా చెప్పగలను? కానీ, చాలామంది ప్రజలు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని కోరితే మాత్రం అలాగే చేయాలి. అసలు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎలక్షన్లు నిర్వహించేందుకు మీకేం ఇబ్బంది?

- సుప్రియా సూలే
ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ

శతాబ్దాల నాటి చెక్క తీగల తోలుబొమ్మలాట కళారూపం చిన్నబోయింది. 'బొమ్మలోల్లు' అని ఆప్యాయంగా పిలుచుకునే పిలుపు శాశ్వతంగా దూరమైంది. అంతరించిపోయే దశలో ఉన్న అపురూపమైన కళకు తిరిగి ప్రాణం పోసిన మోతె జగన్నాథం పరమపదించి కళాలోకాన్ని శోకసంద్రంలో ముంచారు.

తోలుబొమ్మలకు ప్రాణం పోసిన జగన్నాథం

Er.వేదకుమార్ మణికొండ
98480 44713

జనగామ జిల్లా అమ్మాపురం గ్రామానికి చెందిన మోతె జగన్నాథం చెక్క తీగల తోలుబొమ్మలాటను పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేశారు. అలనాటి కథా సంప్రదాయాన్ని బతికించేందుకు అంకితమైన కళాకారుల బృందానికి ఆయనే నాయకత్వం వహించారు. వారి ప్రదర్శనలు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు లాంటి కథలకు ప్రాణం పోశాయి. ఈ బృందం కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ కళకు సేవ చేసే రెండు బృందాలు మాత్రమే మిగిలాయి. అవి కూడా మోతె కుటుంబానికి చెందినవే కావడం గమనార్హం.

జగన్నాథంతో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. 2006లో ఢిల్లీలోని నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్‌లో భాగంగా జగన్నాథం బృందంతో కలిసి మేం పనిచేశాం. అప్పట్లో ఉమ్మడి ఏపీలోని 11 జిల్లాల్లో వారితో కలిసి పర్యటించాం. నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ అవేర్‌నెస్ ప్రచారంలో భాగంగా జగన్నాథం బృందం ఆధ్వర్యంలో జరిగిన తోలుబొమ్మలాట ప్రదర్శనలు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఎంతగానో దోహదపడ్డాయి. సాంస్కృతిక అవగాహనను పెంపొం దించేలా జగన్నాథం నేతృత్వంలో చెక్క తీగల తోలుబొమ్మలాట బృందంతో అనేక వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు నిర్వహించాం. హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనలు కూడా ఇప్పించాం. ప్రముఖ చలనచిత్ర నిర్మాత అజిత్ నాగ్ చెక్క తీగల తోలుబొమ్మలాటలపై 'బొమ్మలోల్లు' పేరిట ప్రత్యేక డాక్యుమెంటరీ నిర్మించారు. అందులో జగన్నాథం జీవితం, కళారంగానికి ఆయన చేసిన సేవలను తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు మా కృషి కూడా తోడవటంతో దేశంలోని 12కి పైగా రాష్ట్రాల్లో జగన్నాథం బృందం ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందింది.

చెక్క తీగల తోలుబొమ్మలాట ఇప్పుడు అంతరించిపోయే దశలో ఉంది. సామాజిక-ఆర్థిక సవాళ్ల కారణంగా యువతరం ఈ కళపై ఎక్కువగా ఆసక్తి చూపకపోవడమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఆ కళను కాపాడుకునేం దుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, కళకు తన జీవితాన్ని అంకితం చేసిన జగన్నాథం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి. ఈ కళను సజీవంగా ఉంచేందుకు కృషిచేస్తున్న ఇతర కళాకారులను కూడా ఆదుకోవాలి. సంప్రదాయ సాంస్కృతిక రూపాన్ని గుర్తించి, అంతరించి పోతున్న ఈ కళను వెలుగులోకి తీసుకురావాలి. జగన్నాథంకు పద్మశ్రీ దక్కేలా ప్రయత్నం జరుగుతున్న సందర్భంలో ఆయన ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరం. ఆయన లోటును పూడ్చలేం.

(వ్యాసకర్త: దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్)